సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. -8లో



వాల్మీకి జీవితం.. ఆదర్శనీయం

వాల్మీకి మహర్షి జీవితం అందరికీ ఆదర్శమని డీఆర్వో గంగాధర్‌గౌడ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0/23.8

జిల్లాలో శనివారం 23.8 – 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

30న సమావేశం

వైవీయూ: కడప నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈనెల 30వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు జిల్లాలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వై. రాఘవరెడ్డి తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న డీసీఈబీ భవన నిర్మాణానికి సంబంధించిన అంశంపై సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కావున జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలకు చెందిన ప్రతినిధులు తప్పక హాజరుకావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం నారంరాజుపల్లి (ఆకేపాడు) జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ వై.రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి 9వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈనెల 31వ తేదీలోపు నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశపరీక్ష 2024 ఫిబ్రవరి, 10వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాల పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ యదుభూషణరెడ్డి

కడప సిటీ: ఉపాధి హామి పథకంలో త్వరితగతిన పనులు పూర్తి చేసి వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని డ్వామా పీడీ యదుభూషణరెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జునరెడ్డిలు సిబ్బందిని ఆదేశించారు. డ్వామా సమావేశ మందిరంలో జిల్లాలో పనిచేస్తున్న సహాయ పథక సంచాలకులు మరియు పీఎం కేఎస్‌వై 2.0 సిబ్బందితో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలను సమీక్షించారు.

జాతీయ పోటీలకు నియామకం



టి. జనార్దన్

కడప స్పోర్ట్స్: కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలో ఈనెల 30 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న 35వ ఆలిండియా పోస్టల్ కబడ్డీ టోర్నమెంట్‌కు టెక్నికల్ అఫిషియల్‌గా కడప నగరానికి చెందిన టి.జనార్దన్ నియమితులయ్యారు. ఈయన కడప డివిజన్ యర్రముక్కపల్లె సబ్ ఆఫీసు పరిధిలోని మామిళ్లపల్లి బ్రాంచ్ పోస్టాఫీసులో ఏబీపీఎంగా పనిచేస్తున్నారు. జిల్లాలో సుదీర్ఘకాలంగా కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషిచేస్తున్నారు.

ఇష్టపడి చదవాలి



రేకులకుంట జెడ్పీహైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్నపీఓ ప్రభాకర్‌రెడ్డి

బ్రహ్మంగారిమఠం: ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివినప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుతారని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి అంబవరపు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రేకులకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యకు మించిన ధనం మరొకటి లేదన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుబ్బరాయుడు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలివచ్చిన జనసందోహం (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా



సామాజిక నీరాజనం

- పసిడిపురి..జనసంద్రం
- వైఎస్సార్‌సీపీ బస్సు యాత్రకు అపూర్వ స్వాగతం
- స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు

సాక్షి ప్రతినిధి, కడప: సామాజిక సాధికార జయభేరి మోగింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన బస్సు యాత్ర అట్టహాసంగా ప్రారంభమైంది. పసిడి పురి..జనసంద్రంగా మారింది. సంక్షేమం పొందిన వారంతా చైతన్యమై స్వచ్ఛందంగా కదిలారు. జరిగిన మేలును గుండెల్లో ఉంచుకుని దారుల్లో బారులు తీరారు. బడుగు వర్గాలకు చేసిన మంచిని మంత్రులు, ప్రజా ప్రతినిధులు వివరిస్తుంటే బతుకుల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకున్నారు. బలహీనులకు సర్కారు అందించిన సాయాన్ని జ్ఞప్తికి తెస్తూ కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ప్రొద్దుటూరులో జరిగిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్రకు అడుగడుగునా నీరాజనాలు పలికారు.పెత్తందారులు, పేదల మధ్య జరుగుతున్న కురుక్షేత్ర యుద్ధంలో జైత్రయాత్ర కొనసాగడం తథ్యమని, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రతిన బూనారు. ప్రొద్దుటూరు దసరా ఉత్సవాలకు పెట్టింది పేరు. భారీ స్థాయిలో ప్రజానీకం ఉత్సవాలను తిలకించి ఆనందపరవశులవుతారు. దసరా ఉత్సవాలు మరోమారు ఇక్కడ కనిపించాయి. రోడ్లు వెంబడి ప్రజానీకం ఉత్సాహంగా కన్పించారు.

ఈ ఎన్నికలు పేదోడికి, పెత్తందార్ల మధ్యే: ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: 2024 ఎన్నికలు పేదోడికి,పెత్తందార్లకు మధ్య జరుగుతాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పుట్టపర్తి సెంటర్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రలో భాగంగా ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వైపు పేదోళ్లు, చంద్రబాబు వైపు పెద్దోళ్లు ఉన్నారని తెలిపారు. ఇది కురుక్షేత్ర యుద్ధం కాదని, మహాభారత యుద్ధం అంతకంటే కాదన్నారు. పేదలపైపు జగన్ ఉన్నాడని, ఆయన అండగా మేము ఉన్నామన్నారు. జగన్ కోసం ఆత్మాహుతికైనా ఈ సైనికులు సిద్ధమని తెలిపారు. సమాజాన్ని సంస్కరించేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని, ఇందు కోసం మరికొన్నేళ్లు సమయం పట్టే అవకాశం ఉందన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ప్రక్షాళన మొదలు పెట్టారని, ఈ యజ్ఞాన్ని పూర్తి చేయాలంటే ఇంకా సమయం పడుతుందన్నారు. ఇది ఓట్ల కోసం వచ్చిన యాత్ర కాదని తెలిపారు. అప్పు లేకుండా పేదోళ్లు మూడు పూటలా అన్నం తింటున్నారని, పెద్దోళ్ల తరహాలోనే పేదలు చదువుకునేందుకు ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్కూళ్ల తరహాలో తీర్చిదిద్దారన్నారు. గుండె జబ్బు వస్తే ఆపరేషన్ చేయించుకునేందుకు ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గతంలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉండేదని ఎమ్మెల్యే తెలిపారు.గతంలో అగ్రవర్ణాలకు మాత్రమే అన్ని పదవులు ఉండేవని, ప్రస్తుతం అందరికి అన్ని పదవులు వస్తున్నాయన్నారు. 60 ఏళ్లకు పింఛన్ వయసును తగ్గించడం, 45 ఏళ్లకే మహిళలకు ద్వారా ఏటా రూ.18,750 పింఛన్ తరహాలో ఇస్తున్నారన్నారు. పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే చంద్రబాబు మాత్రం ప్రజలను సోమరిపోతులను చేస్తున్నారని విమర్శిస్తున్నారన్నారు.

ఉద్దేశ పూర్వకంగానే విమర్శలు

టీడీపీ నాయకులు ఉద్దేశ పూర్వకంగానే తనపై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. తాను మట్కా నడుపుతున్నానని, గుట్కా అమ్ముతున్నానని ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ వారి విమర్శలపై తాను స్వయంగా విచారణ కోసం సీబీఐ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం సమర్పించానన్నారు.

- కార్యక్రమంలో రాజ్య సభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, టీటీడీ పాలకమండలి సభ్యుడు సిద్దవటం యానాదయ్య, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ప్రసంగించారు. పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమినిపల్లి లక్ష్మీదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజం, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.



నాయకులకు గజమాలతో సత్కారం



సీఎం సార్.. నీ రాక పేదవారికి కానుక అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ప్రజలు



సామాజిక సాధికారయాత్ర సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం జరిగిన తటస్థుల సమావేశంలో సాధికారత యాత్ర రాయసీమ ఇన్‌చార్జి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ బీద మస్తాన్‌రావు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మేయర్ సుర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవం తీసుకొచ్చిన సీఎం



ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అనేక ప్రభుత్వాలు, అనేక మంది ముఖ్యమంత్రులను మనం చూశామన్నారు. బీసీలు మా పేటెంట్ హక్కు అని చెప్పుకున్న చంద్రబాబు నాయుడు గడిచిన 14 ఏళ్ల కాలంలో ఏమీ చేయలేదన్నారు. కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని చంద్రబాబు వదిలేశారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ముఖ్యమంత్రి జగన్ సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పెద్ద పీట వేశారన్నారు. ఎస్సీగా పుట్టాలని ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని అనడం, నాయీ బ్రాహ్మణులకు తోక కత్తిరిస్తానని చంద్రబాబు అన్న మాటలు ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. సీఎం జగన్ మాత్రమే నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ, నా మైనారిటీలని చెబుతున్నారన్నారు.

బలహీన వర్గాలకు న్యాయం జరిగింది



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కడప నగర మేయర్ కె.సురేష్ బాబు మాట్లాడుతూ గడిచిన 40 ఏళ్లలో ఏ ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించలేదన్నారు. కేవలం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాకే మార్పులు చేసి బడుగు, బలహీన వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు న్యాయం చేసిందన్నారు. ఎంతో మంది సీఎంలు పరిపాలించినా వారికి ఇలాంటి ఆలోచన రాలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో మైనారిటీలకు మంత్రి పదవి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా నలుగురు బీసీ. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఉప ముఖ్యమంత్రుల పదవులు ఇచ్చానన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన లాంటి పథకాలతో పేదలకు ఎంతో లబ్ది జరిగిందన్నారు.

2024లో వైఎస్ జగన్ సీఎం కాకపోతే నష్టపోయేది బడుగులే:



2024లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకపోతే నష్టపోయేది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలేనని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తెలిపారు. పాదయాత్రలో చెప్పిన విధంగా నవరత్నాలను ప్రవేశపెట్టి 98 శాతం పైగా సంక్షేమ పథకాలను సీఎం జగన్ అమలు చేశారన్నారు. సామాజిక న్యాయానికి సీఎం పెద్ద పీట వేశారన్నారు. అందుకు ప్రత్యక్ష సాక్షి తానేనని ఎంపీ బీద మస్తాన్‌రావు అన్నారు. తాను 30 ఏళ్ల పాటు టీడీపీలో ఉన్నానని, ప్రతి సారి రాజ్యసభ లేదా టీటీడీ బోర్డు అవకాశం కల్పిస్తానని కల్లబొల్లి మాటలతో మోసగించిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. 9 శాతం జనాభా ఉన్న యాదవ సామాజిక వర్గానికి చెందిన తనను సీఎం వైఎస్ జగన్ పిలిపించి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల అభివృద్ధి



గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎంపీ బుట్టారేణుక తెలిపారు. పేద, మధ్య తరగతి వర్గాలు అభివృద్ధి చెందాలనే మంచి ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ప్రతి పేదవాడి ఇంటి వద్దకే ప్రభుత్వాన్ని తీసుకెళ్లి పరిపాలనను అందిస్తున్నారని తెలిపారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ఎంతో గొప్ప కార్యక్రమాలన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్ద పీట వేస్తూ విద్యలో ఏ రాష్ట్రంలో లేని మార్పును మన రాష్ట్రంలో తెచ్చారన్నారు.మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధిని కోరుకునే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు.

రాజ్యాధికారం వైపు నడిపించారు!

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా

సాక్షి ప్రతినిధి, కడప: బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ వర్గాలను చెయ్యి పట్టుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యాధికారం వైపు నడిపిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా తెలిపారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో పాల్గొనేందుకు శనివారం ప్రొద్దుటూరుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి వైవీఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సామాజిక సాధికార బస్సు యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా దిగ్విజయంగా కొనసాగుతోందని చెప్పారు. సామాజిక న్యాయం 76 ఏళ్లలో మాటలకే పరిమితమైందని తెలిపారు. ఇలాంటి పరిస్థితులున్న ఏపీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పూర్తి స్థాయిలో సామాజిక న్యాయం చేస్తూ ముందుకు వెళ్లున్నారు. తన మంత్రివర్గ కూర్పులో కూడా సీఎం 11 మంది బీసీలకు అవకాశం కల్పించారన్నారు. ఐదు ఉప ముఖ్యమంత్రులు ఇస్తే అందులో నలుగురు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాలను నియమించారన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

చంద్రబాబు చేసింది శూన్యం

బీసీల ఓట్లతో గద్దెనెక్కిన చంద్రబాబునాయుడు 14 ఏళ్లు సీఎంగా ఉండి వారికి చేసింది శూన్యమని ఉపముఖ్యమంత్రి అంజద్‌బాషా చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంక్‌గానే చంద్రబాబు చూసేవారన్నారు.ఎస్టీ, మైనార్టీలకు ప్రాతినిథ్యం లేని ప్రభుత్వం ఏదైనా నడిచిందంటే గత చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వమే అని తెలిపారు. కేవలం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చంద్రబాబుకు మైనార్టీలు గుర్తొస్తారన్నారు. చట్టాలను రూపొందించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కూడా 50 శాతం నామినేట్ పదవులను ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని అన్నారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా రూ. 2,38,000 వేల కోట్లు బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. అందులో ఎక్కువ మంది బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ వర్గాలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ది పొందుతున్నార న్నారు. వీటిని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సాధికార బస్సు యాత్రను చేపట్టుతున్నట్లు తెలిపారు. బస్సు యాత్ర ఎక్కడికి వెళ్లినా వేలాదిగా ప్రజలు ముందుకు వచ్చి స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. 70 శాతం పైబడి ఉన్న పేద, మధ్య తరగతి వర్గాలకు పూర్తి స్థాయిలో న్యాయం జరగాలంటే 2024లో మరొక్క సారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన చారిత్రాత్మక ఆవశ్యకత ఎంతైనా ఉందని అని తెలిపారు.

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాకే పేదలకు గుర్తింపు, గౌరవం దక్కిందన్నారు. నా హాయంలో మీకు సంక్షేమం లభించి ఉంటేనే నన్ను ఆశీర్వదించండి అని చెప్పగల్గిన ధైర్యం ఉన్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో వైఎస్ జగన్ ప్రభుత్వంలో రూ.3500 కోట్లుతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలుపుకోవాల్సిన ఆవశ్యత ఉందన్నారు. ఈకార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ ఎస్ యానాదయ్య, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కలమల్ల– ఎర్రగుంట్ల రైల్వే ట్రాక్‌పై శనివారం ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు నిడుజివ్వి గ్రామానికి చెందిన అన్సూబాయ్ గారి రహీమ్ (39)గా గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందని ఎర్రగుంట్ల రైల్వే ఎస్‌ఐ కె.రారాజు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

– ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి– ఆర్టీపీపీ రహదారిలో శనివారం రాత్రి ఆటోను కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పోట్లదుర్తి గ్రామం నుంచి ఆర్టీపీపీకి వెళ్తున్న కారు.. ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. అదే సమయంలో అక్కడ నిలుచొని ఉన్న సంజీవరాయుడు అనే వ్యక్తిపై ఆటో వెళ్లి పడటం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రాజు, సంజీవరాయుడులు గాయపడ్డారు. వారిని వెంటనే స్థానికులు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

కొండను ఢీకొన్న బస్సు

– అందరూ సురక్షితం



కొండను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల నుంచి ప్రకాశం జిల్లా పామూరు వెళుతున్న బద్వేలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సీతారాంపురం ఘాట్‌లో శనివారం మధ్యాహ్నం కొండను ఢీకొని ఆగిపోయింది. బ్రేక్ ఫెయిల్ కావడంతో డ్రైవర్ రామస్వామి బస్సును నిదానంగా కొండను తాకించి నిలబెట్టి, ప్రమాదాన్ని నివారించినట్లు తెలిసింది. కొండ వైపు కాకుండా అటువైపు వెళ్లి వుంటే బస్సు లోయలో పడేదని తెలుస్తోంది. ఈ ఘటనలో కండక్టర్ నాగరాజుకు స్వల్పంగా గాయమైంది. బస్సులో ప్రయాణికులు ఎవరూ గాయపడలేదు. అందరినీ వెనుక వచ్చిన బస్సులో సీతారాంపురం పంపించారు. సమాచారం తెలిసి వెంటనే బద్వేలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు అక్కడికి వెళ్లి పరిశీలించారు.

పిడుగుపాటుతో నలుగురికి గాయాలు

కలికిరి : పిడుగుపాటుతో నలుగురు వ్యక్తులు గాయపడ్డ సంఘటన శనివారం సాయంత్రం మండల పరిధిలోని మర్రికుంటపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మర్రికుంటపల్లి గ్రామం కడియాలవారిపల్లికి చెందిన సి.సహదేవయ్య(చిట్టి), సి.జయలక్ష్మమ్మ, జె.గణేష్, జె.అక్కరాణెమ్మలు గ్రామ సమీపంలోని పొలం వద్ద పొలం పనులు చేసుకుంటూ, పశువులు మేపుతున్నారు. వర్షం రావడంతో దగ్గరలోని చెట్టు కిందికి వెళ్లారు. అదే సమయంలో పిడుగు పడటంతో నలుగురు స్పృహ తప్పి పడిపోయారు. కొంతసేపటికి తేరుకున్న గణేష్, అక్కరాణెమ్మ గ్రామస్తులకు తెలియజేయడంతో వీరిని కలికిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

గ్రహణ ప్రభావం



మూసివేసిన దేవునికడపలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం

చంద్రగ్రహణం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని ప్రముఖ దేవాలయాలను మూసివేశారు. గ్రహణం పాక్షికమే అయినా మన దేశంలో అంత ప్రభావం చూపకపోయినా.. స్పర్శ ప్రభావం ఉంటుందన్న భావనతో మూసివేశారు. జిల్లా దేవదాయశాఖ ఆధ్వర్యంలోని అన్ని ఆలయాలతోపాటు ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి, వేంపల్లె గండి శ్రీ వీరాంజనేయ స్వామి, దేవునికడప శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయాలను సాయంత్రం 5 గంటల తర్వాత మూసివేశారు. తిరిగి ఆదివారం ఆలయం తెరిచే సమయాన్ని తెలుపుతూ నోటీసులు అతికించారు. తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ తలుపులు తెరిచి ప్రాంగణం మొత్తం శుద్ధి చేసి, గర్భగుడిలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, హారతి ఇస్తారు. దాదాపు అన్ని ఆలయాలు ఉదయం 6 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

– కడప కల్చరల్/ఒంటిమిట్ట

పౌర్ణమి కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సీతాసమేతుడైన శ్రీ కోదండ రామస్వామికి వేదపండితులు కల్యాణం జరిపించారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్నపన తిరుమంజనం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో సుప్రభాత సమయాన శ్రీరామచంద్రమూర్తికి పట్టు వస్త్రాలు, పుష్పాలు, ఫలాలు, అభిషేక సామగ్రి సమర్పించారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణ మూర్తులను ఆభరణాలతో ముస్తాబు చేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు.

– ఒంటిమిట్ట

వాల్మీకి జీవితం.. ఆదర్శనీయం



మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్ : వాల్మీకి మహర్షి జీవితం అందరికీ ఆదర్శమని డీఆర్వో గంగాధర్‌గౌడ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ వాల్మీకి జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికార ఇన్‌చార్జి అధికారి కృష్ణయ్య, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ విజయలక్ష్మి, వాల్మీకి ఎంప్లాయిస్ అధ్యక్షులు శ్రీనివాసులు, బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున, ఉద్యానశాఖ ప్రభుత్వ సలహాదారు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



మాట్లాడుతున్న వాణిజ్యపన్నులశాఖ జాయింట్ కమిషనర్ జి.కల్పన

కడప కోటిరెడ్డిసర్కిల్ : వ్యాపారులు ప్రభుత్వానికి సకాలంలో పన్ను(ట్యాక్స్)లను చెల్లించాలని వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జి.కల్పన సూచించారు. శనివారం సాయంత్రం కడప నగరంలోని శ్రీనివాస రెసిడెన్సీలో కడప డివిజన్ పరిధిలో జీఎస్టీపై ట్రేడ్ అడ్వయిజరీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాలో పాత బకాయిలు రూ.350 కోట్ల మేరకు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ బకాయిలను సరైన సమయంలో చెల్లించాలని కోరారు. అలా కట్టకపోతే ఫైల్స్ ఆటోమేటిక్‌గా బ్లాక్ అవుతాయని సూచించారు. కార్యక్రమంలో ఏపీ టీడీసీఏ రాష్ట్ర ప్రెసిడెంట్ షరీఫ్‌ఖాన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ హరి కిశోర్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కేవీ సుబ్బారెడ్డి, వంకధారి వీరభద్రయ్య, నరసింహమూర్తి, ప్రభాకర్‌రెడ్డి, హరికృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని కలెక్టర్ విజయ రామరాజు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 2023–24 సంవత్సరానికి గాను బ్రహ్మంగారిమఠం, మైదుకూరు, ప్రొద్దుటూరు, శ్రీ అవదూత కాశినాయన, పులివెందుల మండలాల్లో మొత్తం 200 హెక్టార్లలో ఉద్యాన పంటగా ఆయిల్‌పామ్ సాగు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్ఎంఈఓ–ఓపీ పథకం ద్వారా ఈ పంట సాగుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. రైతులకు ప్రయోజనం చేకూరేలా రాష్ట్ర ఉద్యానశాఖ పలు రాయితీలు ప్రకటించిందన్నారు. దేశవాళీ మొక్కల పెంపకం ఖర్చు కోసం హెక్టారుకు రూ.20 వేలు, విదేశీ రకానికి రూ.29 వేలు చొప్పున ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. ఎరువులు, అంతర్ పంటల సాగు నిర్వహణ కోసం నాలుగేళ్లకుగాను హెక్టారుకు రూ.42 వేలు అందిస్తుందన్నారు. డ్రిప్ పరికరాల కోసం ఎన్ఎంఈఓ–ఓపీ పథకం నిబంధనలను అనుసరించి రాయితీ అందిస్తామన్నారు. మొక్కలు నాటిన నాలుగేళ్ల నుంచి 30 ఏళ్ల వరకు నిరంతరం ఆదాయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బలరామిరెడ్డి, సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ జీఎం కొండారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రాజీవ్ మైఖేల్, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ముద్దనూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఆంజనేయులు(44) అనే వ్యక్తి శనివారం మృతి చెందాడు. సీఐ నరేష్ బాబు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దేనేపల్లె గ్రామానికి చెందిన ఆంజనేయులు ముద్దనూరులో నివాసం వుంటున్నాడు. పొలం పనుల నిమిత్తం ఈ నెల 21వ తేదీన దేనేపల్లెకి వెళ్లి తిరిగి మోటార్‌బైక్‌పై రాత్రి ఇంటికి వస్తుండగా.. మార్గంమధ్యలో అదే గ్రామానికి చెందిన ఓ మహిళ కూడా అతనితో బైక్‌లో ప్రయాణించింది. స్థానిక జమ్మలమడుగు బైపాస్ క్రాస్ వద్దకు రాగానే క్యాంపర్ వాహనం ఆంజనేయులు ప్రయాణిస్తున్న మోటార్‌బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మహిళకు స్వల్ప గాయాలయ్యాయ. వారిని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అదే రోజు రాత్రి ఆంజనేయులును కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

అసత్యాలతో ఆస్తి కాజేయాలని చూస్తున్నారని ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఖాసీంబీ

దువ్వూరు : అసత్య ఆరోపణలు చేస్తూ క్రమంగా తన ఆస్తులను కాజేయాలని చూస్తున్న మిద్దె అక్బర్ బాషాపై చర్యలు తీసుకోవాలని ఎర్రబల్లె గ్రామానికి చెందిన సద్ది ఖాసీంబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖాసీంబీ పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. భర్త ఖాసీం షా చనిపోయాక ఆయన నుంచి ఖాసీంబీకి మాచనపల్లె గ్రామ పొలంలో ఎకరా 50 సెంట్ల భూమి, నంద్యాల జిల్లా చాగలమర్రిలో 4 సెంట్ల స్థలం ఇల్లు వచ్చాయి. ఖాసీంబీకి పిల్లలు లేకపోవడంతో తన అన్నకూతురు అఫ్సానా, ఆమె భర్త అక్బర్ బాషా ఇద్దరూ ఆమె ఇంటిలో ఉన్నారు. తన భూమిని అఫ్సానాకు దాన విక్రయంగా ఇచ్చినట్లు తప్పుడు దస్తావేజులు సృష్టించి కాజేయాలని చూశారని ఖాసీంబీ తెలిపారు. విషయం తెలుసుకుని ఆ దస్తావేజులను తాను రద్దు చేయించానని పేర్కొన్నారు. అనారోగ్య కారణాల రీత్యా ఒక ఎకరా పొలం పుల్లారెడ్డిపేటకు చెందిన ఇరగంరెడ్డి విశ్వేశ్వర్‌రెడ్డికి విక్రయించానని, మిగతా అర ఎకరా పొలం కౌలుకు ఇచ్చి జీవనం సాగిస్తున్నానని చెప్పారు. తన పొలంపై అక్బర్ బాషాకు ఎలాంటి హక్కు లేకున్నా తప్పుడు పత్రాలతో మైదుకూరు కోర్టులో కేసు వేశాడని, అది కోర్టులో విచారణ సాగుతోందని చెప్పారు. భూమిలోకి దిగడానికి తనకు కోర్టు ఆర్డర్ ఉందని అబద్ధాలతో మీడియా ద్వారా అక్బర్ బాషా అందరిని నమ్మిస్తున్నాడని పేర్కొన్నారు. మిద్దె అఫ్సానా, అక్బర్ బాషాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తన ఆస్తిపై వారికి ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. తన పొలం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డికి, కడప మేయర్ సురేష్‌బాబుకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అసత్య ఆరోపణలతో మోసాలకు పాల్పడుతున్న అక్బర్‌బాషా, అఫ్సానాలపై చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలకు విశేష స్పందన



సైక్లింగ్ ఎంపికలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అరుణకుమారి

కడప స్పోర్ట్స్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో స్విమ్మింగ్, హాకీ, ఫుట్‌బాల్, సైక్లింగ్ క్రీడా ఎంపికలు నిర్వహించారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన ఈ ఎంపికలను వైఎస్సార్ క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి కె.జగన్నాథరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కగా రాణించి జిల్లా ఖ్యాతిని చాటి చెప్పాలని సూచించారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి.అమృత్‌రాజ్, క్రీడా పాఠశాల శిక్షకులు అనిల్, ఖాదర్, హరి, వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపాల్‌రెడ్డి, నిత్య ప్రభాకర్, ఇజ్రాయిల్, సునీల్, సుబ్బయ్య, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, ప్రభాకర్, రమేష్, సుబ్బన్న, చంద్రావతి, పద్మ, క్రీడాకారులు పాల్గొన్నారు.

పట్టుదలతోనే విజయం సాధ్యం



గ్రాడ్యుయేషన్‌డేలో పాల్గొన్న వైవీయూ వీసీ

రాజంపేట : విద్యార్థులు క్రమశిక్షణ, లక్ష్యం, పట్టుదల కలిగి ఉన్నప్పుడే విజయం సాధిస్తారని వైవీయూ (యోగివేమన యూనివర్సిటీ) వైస్ చాన్స్‌లర్ చింతా సుధాకర్ అన్నారు. ఏఐటీఎస్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే సభ నిర్వహించారు. వీసీ హాజరై ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ప్రొవిజనల్ సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో గ్రామీణ విద్యార్థులకు సైతం ఇంజినీరింగ్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేసిన ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మారుతీ, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రంగనాథం, హెచ్‌వోడీలు, ఫిజికల్ డైరెక్టరు నాగముని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు

బ్రహ్మంగారిమఠం : డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి 3 రోజులు జైలు శిక్ష, మరొకరికి రూ.10 వేల జరిమానాను జడ్జి విధించారు. నిందితులను బద్వేల్ కోర్టులో హాజరు పరచగా.. జడ్జి ఈ తీర్పు చెప్పారని ఎస్‌ఐ విద్యాసాగర్ శనివారం తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బి.వి.రాములు కుమారుడు అవినాష్ (36) స్వగ్రామంలో విచ్చలవిడిగా రూ.లక్షల్లో అప్పులు చేశాడు. రుణదాతలు ఒత్తిడి ఎక్కువ కావడంతో ఇటీవల మదనపల్లెలోని గుండ్లూరివీధిలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చాడు. అయినా రుణదాతల ఒత్తిడి తగ్గకపోవడంతో మనస్తాపం చెంది నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటున్నాడు. అలాగే పట్టణంలోని కుళాయివీధికి చెందిన అచ్చన్న కుమారుడు ఎం.మహేష్ (26) కుటుంబ సమస్యలతో శుక్రవారం రాత్రి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వాల్మీకివీధికి చెందిన నరసింహులు భార్య నీలావతి(50) కుటుంబ సమస్యల కారణంగా శుక్రవారం రాత్రి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

కురబలకోటకు చేరుకున్న కృష్ణా జలాలు

కురబలకోట : హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు శనివారం కురబలకోటకు చేరుకున్నాయి. అంగళ్లు పంపింగ్ స్టేషన్ వైపు వడివడిగా సాగుతున్నాయి. కాలువ ఇరువైపులా పరీవాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెంపొందుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడో ఉన్న కృష్ణా జలాలు హంద్రీనీవా కాలువ ద్వారా తరలి వస్తుండడం చూసి జనం సంతోషిస్తున్నారు.

ఏనుగుల దాడి.. తోట ధ్వంసం

ఓబులవారిపల్లె : మండలంలోని బాలిరెడ్డిపల్లె శివాజీనగర్ అటవీ సమీపంలో ఉన్న రెండు ఎకరాల అరటి తోటపై ఏనుగులు దాడి చేసి, ధ్వంసం చేశాయి. దెబ్బతిన్న అరటి పంటను ఉద్యాన, అటవీ శాఖల అధికారులు శనివారం పరిశీలించారు. తాను తీవ్రంగా నష్టపోయానని, ఆదుకోవాలని రైతు చంద్రశేఖర్ కోరారు. ఏనుగులు తాగు నీటి కోసం అడవి నుంచి బయటికి వచ్చి ఇలా చేసినట్లు తెలుస్తోందని ఆయన పేర్కొన్నారు. పంట నష్టాన్ని పరిశీలించి, ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని ఉద్యాన శాఖ అధికారి భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో అటవీ, ఉద్యాన శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

పక్కాగా పంట నమోదు



దువ్వూరు మండలం చిన్నసింగనపల్లెలో అర్హుల జాబితాను ప్రదర్శిస్తున్న సచివాలయ సిబ్బంది



బద్వేల్ మండలం రాచాయపేట ఆర్‌బీకేలో రైతుల వివరాలు తెలియజేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్

- ఆర్‌బీకేల్లో జాబితా ప్రదర్శన
- ఈ నెల 29 వరకు అభ్యంతరాల స్వీకరణ
- ప్రారంభమైన గ్రామ సభల నిర్వహణ
- నవంబర్ 1న తుది జాబితా ప్రదర్శన

కడప అగ్రికల్చర్ : వ్యవసాయ సాగులో రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా వెన్నుదన్నుగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన అన్ని రకాల సేవలు అందిస్తోంది. అలాగే ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఈ క్రాపు ద్వారా పంటల నమోదు తప్పనిసరిగా చేసింది. ఈ క్రాపు నమోదు కార్యక్రమాన్ని కూడా ప్రతిష్టాత్మకంగా, పారదర్శకంగా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంతో సామాజిక తనిఖీ కోసం ఈ క్రాపు అర్హుల జాబితాను జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించారు. ఈ జాబితాలో రైతుల పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణం పంటల సాగు తదితర వివరాల నమోదులో ఎక్కడైనా పొరపాట్లు చోటు చేసుకుని ఉంటే.. వాటిని సరిచేసుకునేందుకు ఈ నెల 29వ తేదీ వరకు గడువు ఇచ్చారు. దీనిపై రైతు భరోసా కేంద్రాల సిబ్బంది కూడా గ్రామ సభలను నిర్వహించి ముసాయిదా జాబితాలో ఉన్న రైతుల ఈ క్రాపు నమోదు వివరాలను సమగ్రంగా చదివి వినిపిస్తున్నారు. కావున రైతులు ముసాయిదా జాబితాను పరిశీలించుకుని అభ్యంతరాలు ఏమైనా ఉన్నట్లయితే సవరణ కోసం రైతు భరోసా కేంద్రాలో ఉన్న విలేజ్ అగ్రికల్చర్ అసిసెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించి రాతపూర్వంగా తెలియజేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 29వ తేదీ వరకు సమయాన్ని ఇచ్చారు.

వంద శాతం పూర్తి

రైతు భరోసా కేంద్రాల్లో ఈ క్రాపు నమోదు వందశాతం పూర్తయింది. ఇందుకు సంబంధించి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ రెవిన్యూ అసిస్టెంట్‌ల ధ్రువీకరణ 100 శాతం పూర్తయింది. ఇలాగే ఈకేవైసీ 98.76 పూర్తయింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల పంటలకు సంబంధించి 1,12,124 మంది రైతులకు 3,03,521 ఎకరాలకు గాను 3,03,488 ఎకరాలలో ఈ క్రాపు నమోదు చేసి వంద శాతం పూర్తి చేశారు. అలాగే ఈకేవైసీకి సంబంధించి 1,10,716 మంది రైతులకు 2,99,753 ఎకరాల్లో పూర్తయి 98.76 శాతంగా నమోదైంది.

క్షేత్రస్థాయి పరిశీలన

ఈ ఏడాది నేషనల్ ఇన్‌ఫర్మెటిక్ సెంటర్(ఎన్‌ఐసీ) సౌజన్యంతో ప్రత్యేకంగా డిజైన్ చేసిన యాప్‌లో రైతుకు సంబంధించిన ఆధార్, వన్‌బితో లింక్ అయిన బ్యాంకు ఖాతాకు వివరాలు, ఫోన్ నంబర్ వివరాలను నమోదు చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత జియో ఫెన్సింగ్ ద్వారా సరిహద్దులు నిర్ధారించి రైతు ఫొటోతో పంట పొలం వద్ద విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ అప్‌లోడ్ చేశారు.

సవరణకు ఇదే ఆఖరి అవకాశం



రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ సభలను నిర్వహించి అర్హుల జాబితాలను ఆర్‌బీకే సిబ్బంది చదవి వినిపిస్తారు. ఇందులో ఏవైనా తప్పులున్నా, అభ్యంతరాలు ఉన్నా ఆర్‌బీకే వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు రాత పూర్వకంగా తెలియజేయాలి, ఈ క్రాపు సవరణకు ఇదే ఆఖరి అవకాశం. నవంబర్ 1న తుది జాబితాను ప్రదర్శిస్తారు.

– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి.